క్లుప్తంగా

నేటి నుంచి తిరు కల్యాణోత్సవం

కందుకూరు: వేంకటేశ్వరస్వామి వారి తిరు కల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సర్పంచ్ కాసుల రాంచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో ప్రకటించారు. ఆదివారం మండల పరిధి నేదునూరులోని ఆలయంలో విష్వక్సేనార్చన, పుణ్యావాహచనం, రక్షాబంధనం, మత్సంగ్రహణం, అంకురార్పణ, సోమవారం ఉదయం స్వామి వారికి అభిషేకం, ధ్వజారోహణ, రాత్రికి గరుడ సేవ, మంగళవారం మధ్యాహ్నం 1 గంటకు కల్యాణోత్సవం, రాత్రికి రథోత్సవం, బుధవారం ఉదయం కుంకుమార్చన, 11 గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతం, శకటోత్సవం, గురువారం హోమం, పూర్ణాహుతి, సప్తావర్ణాల కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు

నృసింహ ఆలయ వార్షికోత్సవం

తుక్కుగూడ: రావిర్యాల సూర్యగిరి లక్ష్మీనృసింహ ఆలయ మొదటి వార్షికోత్సవాల సందర్భంగా.. లక్ష్మీనృసింహ స్వామి కల్యాణ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాగణంలో యజ్ఞయాగాలు నిర్వహించారు. నవగ్రహాలకు పూజలు చేశారు. ఆలయంలో ఉన్న లక్ష్మీనృసింహ, అంజనేయ, శివ స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది మీగడ కాశీనాథ్, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జల్సా కార్యక్రమం

ఆమనగల్లు: ఆమనగల్లులో ఆదివారం దారుల్ ఉలూమ్ అన్వరే ముస్తఫా ఆధ్వర్యంలో జల్సా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మదర్సా అధ్యక్షుడు సయ్యద్ ఖలీల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అల్హజ్ సయ్యద్ రవూఫ్ అలీ ఖాద్రీ ముల్తానీ, అల్హజ్ మహ్మద్ తస్లీం అన్సారీ ఖాద్రీ హాజరవుతారని చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జల్సా జరుగుతుందని, మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఆటల్లో గెలుపోటములు సహజం

ఆలయ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి



టోర్నీని ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్, సర్పంచ్, ఉప సర్పంచ్

తలకొండపల్లి: గెలుపోటములను సమ దృష్టితో చూస్తూ, క్రీడా స్ఫూర్తిని చాటాలని ఆలయ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. క్రీడలతో మానసికోల్లాసమే కాదు.. ఐకమత్యం పెరుగుతుందని తెలిపారు. దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వాలీబాల్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు, పీఈటీ మల్లేశ్ ఆధ్వర్యంలో 17వ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై.. సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతితో కలిసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. పల్లెల్లో ప్రతిభ గల క్రీడాకారులు ఉంటారని, వారి క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. అనంతరం శతాబ్ది టౌన్‌షిప్ చైర్మన్ కాసు శ్రీనివాస్‌రెడ్డి రూ.60 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో సురెందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, సత్యం, కృష్ణ, మహేశ్, వెంకటేశ్, హరికృష్ణ, రాజు, మల్లేశ్, కుమార్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పశు సంపదను కాపాడుకోవాలి

తలకొండపల్లి: పశువులకు వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని, పశు సంపదను కాపాడుకోవాలని మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని, పశువుల ఆరోగ్య సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చుక్కాపూర్‌లో శనివారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిలుగా హాజరైన సర్పంచ్ కిష్టమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి అనుబంధంగా పశువుల పెంపకం చేపడితే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని చెప్పారు. పశువులు ఈనిన వెంటనే బలమైన ఆహారాన్ని అందించాలని డాక్టర్ శంకర్ రైతులకు సూచించారు. గర్భకోశ వ్యాధి మందులు ఎముకల పొడి, టానిక్‌లు ఉచితంగా అందజేశారు. ఈ శిబిరంలో 35 పశువులకు వివిధ రకాల వ్యాధుల పరీక్షలు చేశారు. సుమారుగా 250 పశువులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, డాక్టర్లు శంకర్, విజయ్, శ్యాంసుందర్, సూపర్‌వైజర్ శ్రీశైలం, సిబ్బంది నర్సింహ, వినోద్‌బాబు, రాములు, రామకృష్ణ, నైవీస్, రైతుబంధు కో ఆర్డినేటర్ మల్లారెడ్డి, రైతులు, శ్రీధర్‌రెడ్డి, కృష్ణమూర్తి, మల్లేశ్, నరసింహ, జంగయ్య, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డపై అనుచిత వ్యాఖ్యలా?

- బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్‌నేతల డిమాండ్
- 'బండి' దిష్టిబొమ్మ దహనం



కందుకూరు: బండి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బడంగ్‌పేట్: మచ్చలేని నాయకురాలిపై బురదజల్లె ప్రయత్నం చేయడంతో పాటు అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ ఖబడ్దార్ అని, నోరు అదుపులో పెట్టుకోకపోతే రాష్ట్రంలోనే తిరగనీయమని బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి హెచ్చరించారు. శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితను ఉద్దేశిస్తూ చేసిన అనుచిత వ్యాక్యలకు నిరసనగా.. అంబేడ్కర్ చౌరస్తా నుంచి కొత్త మున్సిపాలిటీ వరకు బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా వెళ్లి, బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. ఆడపడుచులపై అనుచిత వ్యాక్యలు చేసే సంస్కృతి బీజేపీకే చెల్లిందని ధ్వజమెత్తారు. బండి సంజయ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు పెద్దబావి ఆనంద్‌రెడ్డి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ నందీశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ యూత్ అధ్యక్షుడు చిత్రం సాయి, ఎస్సీసెల్ అధ్యక్షుడు సంతోష్, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు డానియల్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

హుడాకాంప్లెక్స్‌లో..

హుడాకాంప్లెక్స్: శాసనమండలి సభ్యురాలు, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని వెంటనే అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధి కొత్తపేట చౌరస్తాలో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనిత, నాయకులు బాలకిషన్, రాజేష్‌గౌడ్, సుదర్శన్, మహ్మద్ సలీం, ఇస్మాయిల్, నీలకంఠం నాగమణి, ప్రవీణ్, సిలివేరు వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.



మీర్‌పేట: సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

దురదృష్టకరం

మీర్‌పేట: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను, బతుకమ్మ పండుగను ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన తెలంగాణ ఆడబిడ్డపై బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని బీఆర్ఎస్ మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, అనంతరం చౌరస్తాలో సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కామేష్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంటు సభ్యుడైన సంజయ్.. మహిళ పట్ల ఏ మాత్రం గౌరవం లేకుండా మాట్లాడడం అహంకారానికి నిదర్శనమని, వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, నాయకులు జెటావత్ శ్రీనివాస్‌నాయక్, భూపేష్‌గౌడ్, కార్పొరేటర్లు గజ్జల రాంచందర్, అక్కి మాధవి, జ్యోతి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

కందుకూరు: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం పీఎస్‌లో బండిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి మాట్లాడారు. మహిళలను కించపరిచే విధంగా బండి వ్యాఖ్యలు ఉన్నాయని, ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు ఇందిర, సర్పంచులు యాలాల శ్రీనివాస్, శ్రీదేవి, బాలమణి, ఇందిరమ్మ, శ్రీలత, ఎంపీటీసీలు రాములు, సురేష్, డైరెక్టర్ పొట్టి ఆనంద్, నియోజకవర్గం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల కార్తిక్, మండల యూత్ అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, కాకి రవి, కాకి దశరథ, నవీన్‌కుమార్, వెంకటేశ్, రాజశేఖర్‌గుప్తా, సామ ప్రకాష్‌రెడ్డి, పారిజాతం, యాదయ్య, ఆర్.యాదయ్య, జంగయ్య, గణేశ్, పాండు, రాజు, మహిపాల్, నర్సింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు

భవన నిర్మాణం పూర్తి చేయాలి



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

తుక్కుగూడ: సమీకృత మార్కెట్ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ సూచించారు. శనివారం మున్సిపాలిటీ కేంద్రంలోని వారాంతపు సంత ప్రదేశంలో నిర్మిస్తున్న సమీకత మార్కెట్ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. వెజ్, నాన్‌వెజ్ ప్రజలకు ఒకే ప్రదేశంలో అందుబాటులో ఉండేందుకు ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఈ భార్గవ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



దేవతామూర్తుల వేషధారణలో విద్యార్థులు

మీర్‌పేట: జిల్లెలగూడలోని లార్డ్స్ హైస్కూల్ 18వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం రాత్రి పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. వేడుకకు డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులను పాఠశాల యాజమాన్యం తీర్చి దిద్దడం అభినందనీయమని చెప్పారు. అనంతరం విద్యార్థుల ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ జవహర్‌లాల్ నెహ్రూ, అభ్యాస్ అకాడమీ సీఈఓ ఫణిపవన్, కార్పొరేటర్ అనిల్ యాదవ్, లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీలత, అనూరాధ, ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా స్వాతి నక్షత్ర వేడుకలు



తుక్కుగూడ: జిన్నాయిగూడ లక్ష్మీ నరిసింహ స్వామి ఆలయంలో శనివారం వైభవంగా స్వాతి నక్షత్ర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉన్న స్వామి వారికి ప్రత్యేక అలంకరణతో పాటు, పూజలు చేశారు. అనంతరం సుదర్శన నరసింహ ఇష్ట, పూర్ణాహుతి, స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శివశంకర్, పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా వైద్య సేవలు

జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్ట్(అనితారెడ్డి తీగల) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్, ఫౌండర్ తీగల అనితారెడ్డి అన్నారు. శనివారం అమీర్‌పేట్ గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఫౌండేషన్ తరపున ఆదుకుంటానని చెప్పారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేలా వైద్య సేవలు అందిస్తామని ఆమె తెలిపారు. అంతకు ముందు వైద్యులు రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ నర్సింగ్, ఎంపీటీసీ కుమారి రాయప్ప, వార్డు సభ్యులు, నాయకులు బ్యాగరి రాజు, మచ్చెందర్ గౌడ్, ఎర్ర రవి పలువురు పాల్గొన్నారు.

మీ ఆశీర్వాదమే మాకు దీవెనలు

- నియోజకవర్గానికి అండగా ఉంటాం
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ పారిజాతరెడ్డి



గుర్రంగూడలో పాదయాత్ర చేస్తున్న పారిజాతరెడ్డి, చల్లా తదితరులు

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, మీ ఆశీర్వాదమే మాకు చల్లని దీవెనలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతరెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో పాదయాత్రలో భాగంగా ఆమె గుర్రంగూడలో యాత్ర ప్రారంభించి మాట్లాడారు. ప్రజల కష్టాలు తెలుసుకునేందుకే ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ అధికారంలోకి రాగానే ప్రజల కష్టాలు, రైతుల ఇబ్బందులు, నిరుద్యోగులకు అండగా ఉండే విధంగా ప్రణాళికతో ముందుకు రాబోతున్నామని తెలిపారు. మొదటి నుంచి నియోజకర్గంతో పాటు, బాలాపూర్ మండలం పార్టీకి కంచుకోటని గుర్తు చేశారు. ప్రజల కష్టాలు తీర్చే సమయం ఆసన్నమైందని, పార్టీని ప్రజలు ఆశీర్వదీస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అష్టకష్టాల పాలవుతున్నారని, ఆ కష్టాలు తీరే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బంగారి బాబు, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు రాఘువేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, సంతోషి, ఎర్ర జైహింద్, బాలు నాయక్, మనోహర్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నవారు మల్లారెడ్డి, సుభాన్, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటేష్ గౌడ్ తదితరుల పాల్గొన్నారు.

షర్ఫుద్దీన్ దర్గాలో నాయకుల ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పహాడీషరీఫ్: పహడిషరీఫ్ బాబా షర్ఫుద్దీన్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి శనివారం దర్గాలో ప్రార్థనలు చేశారు. పార్టీ నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడు యూసుఫ్ ఖాద్రీ ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన.. బాబాకు పూలు, ఛాదర్ సమర్పించారు. అనంతరం దర్గా నిర్వాహకులు ఆయనకు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. షర్ఫుద్దీన్ బాబా దర్గా.. మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని, అన్ని వర్గాల ప్రజలు ఈ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని మనుషులంతా ఒక్కటే అని చాటి చెప్పడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ధన్‌రాజ్ గౌడ్, అహ్మద్ బామ్, మన్నె రవి, బారీ, అఫ్జల్, హబీబ్, ఫయాజ్, ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింటికీ టీడీపీ

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈనెల 12 (ఆదివారం)నుంచి ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి యాదీలాల్ తెలిపారు. పట్టణంలో ఆదివారం పార్టీ కార్యాలయం, ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 18, బెండ 52, పచ్చి మిర్చి 50, కాకర 45, బీర 45, క్యాబేజీ 11, ఫ్రెంచిబీన్స్ 55, క్యారెట్ 18, ఆలు 18, దోస 45, సొర 15, పొట్ల 18, ఉల్లి 14, చామగడ్డ 68 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



వీరాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి, అమీర్‌పేట్ గ్రామంలో సీతారాంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం, పుష్పాలంకరణతో పాటు తమలపాకులతో అర్చన చేశారు. వీరాంజనేయ స్వామి ఆలయంలో దంపతులు సత్యనారాయణ వ్రతాలు చేశారు. శనివారం కావడంతో మండలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమీర్‌పేట్ ఆంజనేయ స్వామి అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్, ఆలయం పూజారి తొండుపల్లి సంతోష్ శర్మ, వీరేశం ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు



స్వామివారి నిజరూప దర్శన కార్యక్రమంలో పూజలు చేస్తున్న వేద పండితులు

తలకొండపల్లి: దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి గజ వాహనసేవను ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను గజ వాహనంపై అధిష్టించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణాల మధ్య ఆలయ ప్రాంగణం నుంచి కల్యాణ మండపం వరకు గజ వాహనాన్ని ఊరేగించారు. శనివారం ప్రాతఃకాలమున స్వామి నిజరూప దర్శన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు మంత్రాలు చదువుతుండగా స్వామికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతి, ఆలయ చైర్మన్ రాజుకుమార్‌రెడ్డి, ఈఓ మోహన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, మాజీ ఎంపీటీసీ రవి, ఆంజనేయులు, సత్యం, కృష్ణగౌడ్, స్వామి, లక్ష్మయ్య, కృష్ణయ్య, రాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆమనగల్లు: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని, పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. మంగళపల్లికి చెందిన శాంతయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.28 వేలు, కడ్తాల మండలం ముదివ్వేన్‌కు చెందిన మాధవికి రూ.50 వేలు, పతమ్మకు రూ.36 వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండైనా వానైనా.. తప్పని నిరీక్షణ

- బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- విన్నవించినా పరిష్కారం కాని సమస్య
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కర్కల్‌పహాడ్‌లో బస్సుల కోసం ఎండలోనే నిరీక్షిస్తున్న ప్రయాణికులు

కడ్తాల్: గ్రామీణ ప్రాంతాల్లో బస్ స్టేజీల వద్ద షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సమయానికి బస్సులు రాకపోవడంతో ఎండ కాలంలో ఎండకు, వర్షాకాలంలో వానకు, చలి కాలంలో చలికి గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. స్టేజీల వద్ద చెట్లు, కూర్చోవడానికి ఎలాంటి సౌకర్యం లేక ప్రయాణికులు నీరసించిపోతున్నారు. మండల పరిధిలో గతంలో మైసిగండి, కర్కల్‌పహాడ్ గ్రామాల్లో బస్సు షెల్టర్లు ఉండేవి. రోడ్ల విస్తరణలో వాటిని తొలగించారు. జాతీయ రహదారిపై గల మైసిగండి, కర్కల్ పహాడ్‌లో బస్ షెల్టర్లు లేక పోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపైనే నిలబడాల్సిన దుస్థితి నెలకొంది.

షెల్టర్లకై విన్నపాలు

మండల పరిధిలోని మక్తమాధారం, రావిచేడ్‌వంపుగూడ, న్యామతాపూర్, చల్లంపల్లి, రేఖ్యతండా తదితర గ్రామాల్లో బస్ షెల్టర్లు నిర్మించక పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రం కడ్తాల్‌తో పాటు, ఆమనగల్లు, హైదరాబాద్ నగరాలకు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో స్టేజీల వద్ద బస్ షెల్టర్లు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభం కావడంతో ఎండలో నిరీక్షిస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో ఎండలు ముదిరితే ఆ ఎండల వేడిమి, ఉక్కపోత కారణంగా మరింత ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఇన్ని సమస్యల నేపథ్యంలో పలుమార్లు ఆధునిక పద్ధతుల్లో బస్ షెల్టర్లు నిర్మించాలని బాధిత గ్రామాల ప్రజలు.. అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్టేజీల వద్ద బస్ షెల్టర్లు నిర్మించి, ప్రయాణికుల కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



గ్రామంలో గతంలో బస్ షెల్టర్ ఉండేది. ఐదు సంవత్సరాల క్రితం రోడ్డు విస్తరణలో.. ఉన్న బస్సు షెల్టర్‌ను తొలగించారు. అప్ప టి నుంచి ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే నిలబడి ఇబ్బంది పడుతున్నారు. నిలువ నీడలేదు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్ నిర్మించాలి.

– రమేశ్, కర్కల్‌పహాడ్